క్లుప్తంగా

పరామర్శ



సీతారామునిపేటలో రేగాన కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొత్తపేటకు చెందిన ఎంపీటీసీ సభ్యురాలు మిరప శాంతికు మారిని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడ్డుకొండ అప్పలనాయుడు పరామర్శించారు. ఆమె తండ్రి ఇటీవల మరణించగా విషయం తెలుసుకున్న ఆయన..సోమవారం ఆ గ్రామం వెళ్లి బాధిత కుటుంబాన్ని కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. అనంతరం సీతారామునిపేట వెళ్లి వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు సోదరుడి కుటుంబాన్ని పరామర్శించారు. శ్రీనివాసరావు సోదరుడి కుమారుడి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని, సంతాపం తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కోట్ల పైడినాయుడు, మాజీ సర్పంచ్ రాంబార్కి రామారావు తదితరులు ఉన్నారు.

యూరియా కోసం రైతుల అవస్థలు



రైతులతో కిక్కిరిసిన చొల్లంగిపేట రైతు సేవా కేంద్రం

డెంకాడ: మండలంలోని రైతులంతా యూరియా కోసం అవస్థలు పడుతున్నారు. ఉదయం నిద్రలేచింది మొదలుకుని, రాత్రి పడుకునే వరకు ఒకటే యాతన. యూరియా ఎక్కడుంటుంది...ఎక్కడకు వెళ్తే యూరియా దొరుకుతుందనే ఆలోచనే తప్ప మరొకటి అన్నదాతకు లేదంటే అతిశయోక్తి కాదు. సోమవారం చొల్లంగిపేట రైతు సేవా కేంద్రానికి 133 బస్తాల యూరియా వచ్చిందని తెలుసుకున్న రైతులు కేంద్రానికి పోటెత్తారు. యూరియా కోసం క్యూలైన్‌లో గంటల కొద్ది వేచి ఉన్నారు. రైతుల రద్దీ చూసిన వ్యవసాయ సిబ్బంది ఆ బస్తాలు చాలవని మరికొన్ని బస్తాలు తెప్పించే ప్రయత్నం చేశారు.


ఆర్థికసాయం అందజేత



వెంకటరావుకు నగదు అందజేస్తున్న దృశ్యం

విజయనగరం: నగరపాలక సంస్థ కార్యాలయంలో డీపీవోగా సేవలందిస్తున్న వెంకటరావుకు మున్సిపల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు ఆర్థికసాయం చేశారు. ఆయన కుటుంబ పరిస్థితి దయనీయంగా ఉందని తెలుసుకుని చందాల రూపంలో సేకరించిన రూ.1.25 లక్షలను ఆయనకు సోమవారం అందజేశారు. తమతో పనిచేస్తున్న ఉద్యోగులు కష్టకాలంలో ఉంటే వారిని ఆదుకోవాల్సిన నైతిక బాధ్యత ప్రతి ఉద్యోగికి ఉండాలని కమిషనర్ నల్లనయ్య అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు నరసింగరాజు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల ధర్నా



నినాదాలు చేస్తున్న ఆటో కార్మికులు

విజయనగరం గంటస్తంభం: కలెక్టరేట్ వద్ద శ్రీపైడిమాంబ ఆటోకార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆటో కార్మికులు సోమవారం ధర్నా చేపట్టారు. ఎన్నికలకు ముందు ఆటో కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆటో కార్మికులకు నెలకు కనీసం రూ.5 వేలు చొప్పున పెన్షన్ ఇవ్వాలని, పెట్రోలు, డీజిలు ధరల్లో సబ్సిడీ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు పి.శంకరరావు, ఎం.అప్పలరాజు, జె.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ ఎన్జీవో జిల్లా కార్యదర్శి ఎ.సురేష్

భోగాపురం: సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏపీఎన్జీవో జిల్లా కార్యదర్శి ఎ.సురేష్ హామీ ఇచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు పడుతున్న కష్టాలను సంఘం గుర్తించిందని, సమస్యల పరిష్కారానికి అంచెలంచెలుగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

అద్దె భవనాల్లో.. ఇంకెన్నాళ్లు?

- అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ
- నెల్లిమర్ల నియోజకవర్గంలో మొత్తం 377 కేంద్రాలు
- సొంత భవనాలు ఉన్నవి 99 మాత్రమే
- గతంలో చేపట్టిన నిర్మాణాల పూర్తిపై ప్రభుత్వం అశ్రద్ధ
- అద్దె డబ్బుల చెల్లింపులతో ప్రజాధనం వృథా



వైఎస్సార్ సీపీ హయాంలో నిర్మాణం జరిగి తుది దశకు చేరుకున్న ముక్కాం అంగన్‌వాడీ కేంద్రం-1 భవనం



రామచంద్రపేటలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రం



భోగాపురంలో ఇరుకైన అద్దె భవనంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

భోగాపురం: అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తుండడంతో చాలీచాలని వసతులతో అటు సిబ్బంది..ఇటు చిన్నారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. చాలాచోట్ల ఇరుకైన భవనం గదుల్లో కేంద్రాలు ఉండడంతో పిల్లలు స్వేచ్ఛగా ఆడుకునే పరిస్థితి లేదు. అలాగే వెలుతురు అంతగా రాని గదుల్లో చీకటి వాతావరణం నెలకొనడంతో చదువుపై ప్రీస్కూల్ విద్యార్థులు అంతగా ఆసక్తి కనబరచడం లేదని అంగన్‌వాడీ కార్యకర్తలు చెబుతున్నారు. అద్దె భవనాల్లో కేంద్రాలు ఉండడం వల్ల అటు అద్దె భారం తప్పక పోగా సదుపాయాల లేమి కూడా వేధిస్తోందని అంగన్‌వాడీ సిబ్బంది, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా పేరొందిన అంగన్‌వాడీ కేంద్రాలపై ఇంత నిర్లక్ష్యమా? తక్షణమే అద్దె భవనాల్లోని కేంద్రాల నిర్వహణకు సొంత భవనాలు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

విడుదలైన నిధులు ఆపేశారు..

వైఎస్సార్ సీపీ హయాంలో నాడు-నేడు పథకం ద్వారా నెల్లిమర్ల నియోజకవర్గంలో 18 అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణాలకు నిధులు విడుదల చేయడం జరిగింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ నిధులను ఆపేసింది. దీంతో వివిధ నిర్మాణ దశల్లోని అంగన్‌వాడీ భవన నిర్మాణాలు అలాగే ఉండిపోయాయి. దీంతో అరకొర వసతులతో అంగన్‌వాడీ సిబ్బంది, కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలు అవస్థలు పడుతున్నారు.

377 కేంద్రాల్లో 11 వేల మంది..

నెల్లిమర్ల నియోజకవర్గంలోని భోగాపురం, డెకాండ, పూసపాటిరేగ, నెల్లిమర్ల మండలాల్లో మొత్తం 377 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వాటి పరిధిలో 11 వేల మంది(చిన్నారులు, గర్భిణులు, బాలింతలు) ఉన్నారు. ఇదిలా ఉంటే 377 కేంద్రాల్లో 99 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. మిగతావన్నీ అద్దె భవనాల్లోనే మగ్గుతుండడంతో అద్దె భారం పెరిగిపోయింది. ఇదంతా ప్రజాధనం వృథాయే కదా అదే సొంత భవనాలుంటే ఈ వృథా ఉండేది కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

నిర్మాణాల్లో కదలికేదీ?

నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ దశల్లోని అంగన్‌వాడీ భవన నిర్మాణాలు 15 నెలలుగా నిలిచిపోయాయి. కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నిర్మాణాల్లో కదలిక లేదు. భోగాపురం మండలంలో నిర్మిస్తున్న ఆరు భవనాలు ఇంకా అసంపూర్తిగానే ఉన్నాయి. ముక్కాం గ్రామంలోని 1, 2, మెట్టసబ్బన్నపేట, భోగాపురంల్లో నిర్మిస్తున్న భవనాలు అయితే శ్లాబులు వేసి చివరి దశకు చేరుకున్నాయి. మరికొన్ని గ్రామాల్లో నిర్మాణ దశలో ఉన్నాయి.

సొంత భవనాలున్న కేంద్రాలు..

మండలం	కేంద్రాలు
భోగాపురం	18
డెంకాడ	15
పూసపాటిరేగ	36
నెల్లిమర్ల	30



దాదాపు పూర్తి కావచ్చిన ముక్కాం అంగన్‌వాడీ కేంద్రం-2 భవనం

కొన్నిచోట్ల బిక్కుబిక్కు..

ప్రస్తుతం సొంత భవనాల్లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో కొన్ని శిథిలావస్థకు చేరుకోవడంతో అక్కడ సిబ్బంది, పిల్లలు బిక్కుబిక్కుమని రోజులు గడపాల్సిన దుస్థితి. పెచ్చులూడిన శ్లాబు, పగిలిన గచ్చులు, బీటలువారిన గోడలు, విరిగిన కిటికీలు, ఇరుకైన గదుల్లో ఉండలేకపోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి కేంద్రాలకు పిల్లలను పంపించేందుకు తల్లిదండ్రులు కూడా భయపడుతున్నారని అంగన్‌వాడీ సిబ్బంది చెబుతున్నారు.

అనుమతులు రాగానే ప్రారంభిస్తాం..



రామచంద్రపేటలో కొత్తగా నిర్మించిన అంగన్‌వాడీ భవనం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఇంకా ముక్కాంలోని 1, 2 కేంద్రాల భవన నిర్మాణాలు పూర్తయి చివరి దశలో పనులు నిలిచిపోయాయి. భోగాపురం, మెట్టసబ్బన్నపేట గ్రామాల్లోని అంగన్‌వాడీ భవనాలకు తలుపులు, కిటికీలు, గచ్చులు వేసేందుకు నిధులు మంజూరయ్యాయి. అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం. అలాగే మండలంలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు సొంత భవనాల నిర్మాణం కోసం స్థల సేకరణ చేస్తున్నాం.

– ఎల్.సుజాత, ఐసీడీఎస్ పీవో, భోగాపురం ప్రాజెక్ట్

మహిళల ఆరోగ్య పరిరక్షణకు కృషి



విజయనగంఫోర్ట్: వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేసీ సేతు మాధవన్

విజయనగంఫోర్ట్: మహిళల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేయాలని జేసీ సేతు మాధవన్ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలకు వివిధ స్క్రీనింగ్ పరీక్షలు చేసి, వారికి అవసరమైన వైద్యసేవలు కల్పించాలని తెలిపారు. మహిళలు బాగుంటేనే ఇంట్లో వాళ్లంతా బాగుంటారని, తద్వారా ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, డీఎంహెచ్‌వో జీవనరాణి, డీసీహెచ్ఎస్ పద్మశ్రీరాణి తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంఫోర్ట్: మహిళ ఆరోగ్యంగా ఉంటేనే సమాజ శ్రేయస్కరం సాధ్యమని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.జీవనరాణి అన్నారు. స్థానిక జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జిల్లాలో స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ కార్యక్రమంలో భాగంగా క్షేత్ర స్థాయిలో వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు, అవయవదాన అవగాహన సదస్సులు నిర్వహించి, ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. సమావేశంలో డీఎల్‌వో డాక్టర్ కె.రాణి, డీఐవో డాక్టర్ రెడ్డి అచ్యుతకుమారి, డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మశ్రీరాణి తదితరులు పాల్గొన్నారు.

17న జిల్లా బంద్



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న సంఘాల నాయకులు

విజయనగరం గంటస్తంభం: ఆటో కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏఐఎఫ్‌టీయూ న్యూ సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 17న జిల్లా బంద్ నిర్వహిస్తున్నట్లు ఆయా సంఘాల ప్రతినిధులు ఆర్.నారాయణరావు, కె.సురేష్, రంగరాజులు తెలిపారు. ఇదే విషయమై స్థానిక ఎల్బీజీ భవన్‌లో మీడియా సమావేశం సోమవారం నిర్వహించి, బంద్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. వాహన మిత్ర పథకం అమలు చేసి, ప్రతి ఆటో కార్మికునికి రూ.25 వేలు ఇవ్వాలని, జీవో నంబరు 21, 31లను తక్షణమే రద్దు చేయాలని, పోలీస్, ఆర్టీవో వేధింపులు నిలిపివేయాలని, సెక్షన్ 336 కింద దళితులపై కేసులు నిలుపుదల చేయాలని కోరనున్నట్లు పేర్కొన్నారు.

నమ్మించి మోసగించినందుకు.. ప్రభుత్వమే క్షమాపణలు చెప్పాలి

- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'లో మేయర్, డిప్యూటీ మేయర్‌లు విజయలక్ష్మి, శ్రావణి



ఇంటింటికీ వెళ్లి కూటమి మోసాలను వివరిస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్‌లు విజయలక్ష్మి, శ్రావణి

విజయనగరం: ప్రజలను నమ్మించి, మోసం చేసినందుకు గాను కూటమి ప్రభుత్వమే రాష్ట్ర ప్రజానీకానికి క్షమాపణలు చెప్పాలని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్‌లు వెంపడాపు విజయలక్ష్మి, కోలగట్ల శ్రావణిలు డిమాండ్ చేశారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా నగరంలోని 50వ డివిజన్‌లో సోమవారం పర్యటించిన వారు ఇంటింటికీ వెళ్లి కూటమి సర్కారు మోసాలను వివరించారు. ఎన్నికల సమయంలో లేనిపోని హామీలిచ్చి, అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా హామీలన్నీ అమలు చేయలేదని విమర్శించారు. కనీసం సూపర్ సిక్స్ పథకాలన్నీ ఇవ్వలేని పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్ష నేతలపై దాడులు తప్ప పరిపాలన లేదన్నారు. ఓట్లు కోసం ప్రజలకు ఎన్నో రకాల హామీలిచ్చి అవేవీ అమలు చేయకుండా మోసం చేస్తున్న ఏకైక ప్రభుత్వంగా చంద్రబాబు సర్కారు పేరొందిందన్నారు. ఆయన అధికారంలోకి వచ్చిన ప్రతిసారి ఇదే రిపీట్ అవుతోందన్నారు. ఇప్పటికైనా ప్రజలకు చేసిన మోసానికి గాను కూటమి నాయకులు క్షమాపణలు చెప్పాలన్నారు. అలాగే గతంలోని వైఎస్సార్ సీపీ పాలనకు ఇప్పటి కూటమి పాలనకు ఉన్న తేడాను గమనించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ పట్టా ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా ఇంజినీర్స్ డే

ఇంజినీర్స్ డే సోమవారం ఘనంగా నిర్వహించారు. భారతరత్న, ప్రముఖ ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి పురస్కరించుకుని, ఏటా ఈ కార్యక్రమం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. పలు ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలు, అభివృద్ధిలో ఇంజినీర్‌ల పాత్రను వక్తలు ప్రశంసించారు. అనంతరం ప్రాజెక్టుల రూపకల్పనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, ఇంజినీర్లను సత్కరించారు. – విజయనగరం, విజయనగరం అర్బన్, డెంకాడ



విజయనగరం అర్బన్: సీతం ఇంజినీరింగ్ కళాశాలలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాశాల సిబ్బంది



విజయనగరం: జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్ అసోసియేషన్ ప్రతినిధులు



డెంకాడ: లెండి ఇంజినీరింగ్ కళాశాలో విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న సెంటర్ ఎక్స్‌లెన్స్ ఇన్ మారిటమ్ అండ్ షిప్ బిల్డింగ్ జీఎం సబాసాచి



డెంకాడ: మైక్రోసాఫ్ట్ ప్రొడక్షన్ మేనేజర్ మను కపూర్‌ను సన్మానిస్తున్న చింతవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శేఖర్

పశువులకు 'గాలికుంటు' టీకాలు



వ్యాక్సినేషన్‌ను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

డెంకాడ: మండలంలోని అక్కివరం గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు సోమవారం వేశారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ఆ వ్యాధి పశువులకు రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ వ్యాక్సినేషన్ చేపట్టినట్లు పశువైద్యాధికారి శ్రీకాంత్ తెలిపారు. అక్కివరంలో 225, వెదుళ్లవలస, రఘుమండలలో 400, పినతాడివాడలో 300 పశువులకు ఈ టీకాలు వేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పండగగా గుర్తించడం హర్షణీయం

విజయనగరం టౌన్: విశ్వకర్మ మహాయజ్ఞాన్ని రాష్ట్ర పండగగా గుర్తించడం హర్షణీయమని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు జనాప్రసాద్ అన్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో పలువురు అధికారులను సోమవారం కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి, ప్రభుత్వానికి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 17న మహాయజ్ఞంలో పాల్గొనాలని కోరారు.

వినతిపత్రం అందజేత

విజయనగరం టౌన్: మహాకవి గురజాడ జయంతిని రాష్ట్ర పండగగా గుర్తించాలని, ఆ దిశగా కృషి చేయాలని ఎమ్మెల్యే బేబినాయనను జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. ఇదే విషయమై ఆయన ఎమ్మెల్యేను బొబ్బిలిలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా పౌరవేదిక వర్కింగ్ ప్రెసిడెంట్ పి.ప్రభాకరరావు పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య కొట్లాట

విజయనగరం క్రైమ్: మండలంలోని ఓ గ్రామంలో ఇరువర్గాల మధ్య సోమవారం కొట్లాట జరిగింది. మద్యం మత్తులో ఓ వర్గం మరో వర్గాన్ని దుర్భాషలాడుతూ దాడి చేసుకున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న రూరల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మద్యం మత్తులో జరిగిన గొడవగా తేలింది. ఈ మేరకు ఆయా వర్గాలను స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చే పనిలో ఉన్నామని ఎస్ఐ అశోక్ తెలిపారు.

21న మండల సర్వసభ్య సమావేశం

భోగాపురం: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 21వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో గాయత్రి ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. ఎంపీపీ ఉప్పాడ అనూషరెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులంతా వస్తున్నారని, అధికారులు కూడా తమ శాఖ ప్రగతి నివేదికలతో హాజరుకావాలని కోరారు.

ప్రజాసమస్యలను పరిష్కరించండి

విజయనగరం: ప్రజాసమస్యలను తక్షణమే పరిష్కరించాలని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అధికారులను ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన పలు వినతులను ఆయన పరిశీలించి, పలు సూచనలు చేశారు. సమస్యల వారీగా సంబంధిత అధికారులకు వినతులు అందజేసి, వాటిని పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

విజయనగరం: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం 2.0లో భాగంగా అంగీకార్ అనే కేంద్ర ప్రభుత్వ విధానం పట్ల ప్రతిఒక్కరూ చైతన్యం కావాలని కమిషనర్ నల్లనయ్య, గృహ నిర్మాణ సంస్థ పీడీ జి.మురళీమోహన్‌లు తెలిపారు. ఇళ్లు లేని పేదలకు పక్కా ఇల్లు అందివ్వాలన్న ఉద్దేశంతో కేంద్రం ప్రధానమంత్రి ఆవాస్ యోజన అమలు చేస్తోందని, అలాగే సూర్యఘర్ పథకాన్ని కూడా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాతృమూర్తి సేవా పురస్కారాల ప్రదానం

విజయనగరం టౌన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మేడా బుజ్జమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మాతృమూర్తి సేవా పురస్కారాలను సోమవారం ప్రదానం చేశారు. మాతృమూర్తులను సక్రమంగా సంరక్షిస్తున్న వారిని సన్మానించి, పురస్కారాలు అందజేశారు.

సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ఆదాయం లెక్కింపు



ఆదాయ లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఆలయ ఈవో పద్మావతి

విజయనగరం టౌన్: స్థానిక కంటోన్మెంట్ గూడ్సు షెడ్ వద్ద ఉన్న శ్రీసుబ్రహ్మణ్యస్వామి ఆలయ హుండీల్లో భక్తుల కానుకల రూపంలో చేరిన ఆదాయం సోమవారం లెక్కించారు. నాలుగు నెలలకు గాను 1 లక్షా 12 వేల, 532 రూపాయలు లభించినట్లు ఆలయ ఈవో పద్మావతి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రెయ్యి శంకర్ రెడ్డి, అర్చకులు సోమశేఖర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.